# సభ్యత

భర్త ఆఫీసునుంచి వచ్చాకే ఆ పోష్టుమేన్ వస్తాడు. కొస్త ముందుగా రాకూడదూ? సీతకు పోస్టుమేన్ అగపడినప్పుడల్లా గుండె బితుకు బితుకు మంటోంది.

ఆమె కాపరానికి వచ్చి యేడాది అయ్యింది. వచ్చిన ఆరునెలలూ యే గొడవాలేదు. తరువాత ఒకసారి తాత గారింటికి వెళ్ళినప్పుడు మోహనరావు బావ కలిశాడు. ఇదివరలానే తను మాటాడింది. కానిచాటుగా యేవేవో నిందావాక్యాలు వేశాడు. కొన్ని సరిగ్గా

ఆమెకు వినిపించాయి. కొన్ని వినపడలేదు. విన్నాక ఈయతగ్గ జవాబులు యిచ్చింది. ఏంచేస్తానోచూడు అన్నాడు. ఆమె అక్కడ వారంరోజులే వుంది. భర్త వచ్చాక కలసి వచ్చేసింది. వచ్చిన వారం రోజుల తరువాత మోహనరావు సీతకు వుత్తరం వ్రాశాడు. ఆ కవరుపై భార్య పేరు చూచి భర్త సూర్యారావు "నీవుత్తరం" అంటూ ఇచ్చేశాడు.

సీతకు ఆ రాత్రి నిద్దరపట్టలేదు తన చల్లని సంసారంలో అగ్ని రగుల్కున్నట్లు అనిపించింది. ఆమెపై బావకు యెందుకో ఆ పగ: పిచ్చివాని చేతిలో రాయిలా-యీ వుత్తరం ఆయన చూస్తే- యీ అబద్ధాలంతా నిజంగా తీసుకుంటే- తన కాపురం యేమౌనట్లు? భర్త ఆ వుత్తరం గురించి అడిగితే యేమని చెప్పటం: ఆ మరునటి రోజు ఆ వుత్తరాన్ని మండుతున్న పొయ్యిలో వేసింది. ఎన్నో సార్లు ఆ వుత్తరం గురించి, యిదివరకు జరిగిన వివాదం గురించి చెప్దామనుకున్నది. చెప్పి ఆమనలో ఆమెలోసుగు కప్పిపుచ్చడానికి ముందుగా చెప్తోందన్న అనుమానం రేకెత్తించడ మెందుకని ఊరుకుంది.

సూర్యారావు ఆ వుత్తరం పట్టించుకోనట్లుగానే మామూలుగా వున్నాడు. ఆ వుత్తరం యెవరు వ్రాశారనైనా అడగలేదు. ఇదివరకు రోజూ భార్యకు యిస్తున్న మర్యాద, లాలన యిప్పుడూ యిస్తున్నాడు:

భర్త ఆఫీసుకు వెళ్ళిపోగానే ఒంటిగావున్న సీత ఆలోచనలు పరిపరి విధాలుగా పోయాయి. చిన్ననాట తల్లిపోయింది. మారుటి తల్లి మూర్ఖత్వమునుంచి మేనమామ తప్పించాడు. తాతగారింటిలో

పెరిగి పెద్దదైంది. ఏముద్దుముచ్చట్లకు నోచుకోలేని ఆమెకు దేవుడు వుత్తముడైన భర్తను ప్రసాదించాడు. ఏముహూర్తాన ఆ మూడు ముడులు పడ్డాయో అప్పటినుంచీ ఆయన ఆమెను సమ్మోహనం చేశాడు. ఆమెకు యింకొక ధ్యాస లేదు చింతలేదు. లలితమైన ఆమెమనసు యింతవరకు కటుత్వాన్ని బాధను భరించింది. భర్త ఆమెను ఇదివరకు "కని యెరగ"ని ప్రేమతో లాలిస్తున్నాడు. ఆలాలనలో ఆమెతన్మయత్వం చెందుతుంది. అతని కంటేమించిన దేముడు ఆమెకులేడు.

నెలకొక వుత్తరమైనా బాప రాస్తున్నాడు. వ్రాసినప్పుడల్లా ఆమెలో తుపాను రేగుతోంది. భర్త చల్లనిచూపు, ఆదరణలో ఆ భీభత్సం చల్లార్చడానికి ప్రయత్నిస్తుంది. ఆ వుత్తరాల్ని దగ్ధం చేస్తుంది.

ఇప్పుడు ఆమె చూలాలు - ఎన్నో ఆశలు-ఆలోచనలు అమ్మా అని పిలిపించుకొనే అదృష్టం తనకు వస్తోంది: "నా బాబుకు నాలాంటి రూపు-ఆయన గుణగణాలు అసూయ, అహంభావం నాచిన్న తండ్రికి అంటనీయన్లే-నా చిన్ని నాన్న. అమ్మా నాన్నకు కీర్తి తెస్తాడు!" బాబు అప్పుడే పుట్టినట్లు-ఆడించినట్లు-బుద్ధులు చెప్పి నీతికథలు చెప్తున్నట్లు అనుకుంది ........

ఆవేళ సాయంత్రం భర్త ఆఫీసునుంచి వచ్చాడు: మామ్మూలు చిరునగవు-ఆయన వెనుకనే పోస్టుమేన్ వచ్చాడు-వుత్తరం వచ్చింది. అలా గదిలో నిల్చునే ఆ కవరుపై నున్న రాత చూసి తనకే ఆ వుత్తరం వచ్చిందనుకున్నది-కాని సూర్యారావు ఆమెకు యివ్వలేదు. "అదిగో చింపి చదువుతున్నారు!" సీతకాళ్ళు గజగజలాడి అక్కడ నిల్చోలేక వంటయింటికి వెళ్ళిపోయింది

కళ్ళల్లో నీరు తిరిగింది.

గదిలోనుంచే "సీతా!" అని పిల్చాడు "అదిగో ఆ గొంతుక కటువుగా వుంది-వాడు నా సంసారం కాల్చాలని పగబట్టాడు.... నా దేముడా నాకేమీ తెలీదు.... తెలీదు" మనసులోనే మాటాడుకుంది ముందుకుఅడుగు వేస్తున్నా ఒళ్ళంతా జోగిపోతోంది.

"ఇవేళ కోపంవచ్చిందా? ఎప్పుడూ లేనిది రాగానే వంట. యింటికి వెళ్ళి పోయావ్?"

నిట్టూర్చింది. ఆ క్షణంలోనే యిది యెత్తిపొడుపేమో అను కున్నది. రాత్రి ఆమెకు నిద్దర సరిగ్గా పట్టలేదు. పట్టిన కాస్సేపైనా యేవేవో పాడుకలలు: మరుసటిరోజు భర్త ఆఫీసుకు వెళ్ళాక అల వాటుకొద్దీ భర్త తీగలో గ్రుచ్చిన వుత్తరంతీసి చదివింది. అది ఆకాశరామన్న ఉత్తరం. తన భర్తకే వ్రాశాడు-అదిగో దస్తూరీ మోహనరావు బావదే:

అది చదివాక ఆమె శిలా ప్రతిమలా కూర్చుంది. కాస్సేప య్యాక ఆ ప్రతిమ కళ్ళ వెంబడి కన్నీరు ధారలుగా ప్రవహించ సాగింది. ఆమె ఆశలు నిరాశలై ఆలోచనలు ఒక దారిన పోలేదు-

"నేనెందుకు బావతో మాటాడే దాన్ని? నా కెందుకానాడు కొద్దిగానైనా వాడు యింత నీచుడనే ఆలోచన రాలేదా"అనిపొచ్చు కుంది. భర్త మీదవున్న గౌరవం, విశ్వాసంతో తన తప్పేమీ లేదని యెందుకు భయపడాలని, ఆమె సాయంత్రం సరికి మామూలుగా వుండటానికి ప్రయత్నించింది. ఎంత ప్రయత్నించినా యేదో వెలి తిగానే వుంది.

ఆ వారం రోజుల్లోనే యింకో కవరు వచ్చింది ఆ కవరు చది వాక తీగలో గ్రుచ్చాడు. ఈసారి చాలాసేపు అలా ఆలోచించుకొని

కుర్చీమీద కూర్చున్న భర్తను చూస్తుంటే సీతకు భయంవేసింది. ఈ వేళ యేదో అఘాయిత్యం జరుగుతుందనుకున్నది. ఆమె నిల్చున్న నేల పగిలిపోయినట్లు, తను భూమాతలో ఐక్యమయినట్లు అనుకున్నది-కానీ కొద్దిసేపయ్యాక సూర్యారావు మామూలుగామాట్లాడాడు. ఆ రాత్రి భోజనంవగ్గర పరధ్యానంగా వున్నాడు. ఈమార్పు సీతకు యెంతో కష్టం కలిగించింది. ఇంట్లోని చల్లని వాతావరణం మారిపోయినట్లయింది. ఆ రాత్రి భర్త ఇటూ అటూ నిద్రపట్టక కదలటం చూసింది. "ఏం రాశాడో? ఏమిటో? మొదటి వుత్తరంలో వ్రాసినదానికన్నా హెచ్చే వ్రాస్తాడుగాని తక్కువ వ్రాయడే? అది చాలదా? ఈయన అనుమానించడానికి?"

ఆమె భర్త ప్రక్కన వున్నా నిద్దరరాలేదు. తెల్లవారేసరికి తన బ్రతుకేమౌతుందో? భర్త చే విడుపబడితే తన గతి? "నాబాబు కడుపులో నాలానే ఆరాట పడుతున్నాడు! నా నాయనా! నీ అదృష్టమైనా మీ నాన్నను మామ్మూలుగా వుంచదా? అవును -మీనాన్న గొప్పవారు తండ్రీ· తల్లి లేని నన్ను అన్ని విధాల బాధలుపడ్డ నన్ను ఎంచి యెంచి కట్నం పుచ్చుకోకుండా పెళ్ళి చేసుకున్నారే అలాంటి మీ నాన్న- నన్ను అనుమానిస్తారా? అనవసరంగా నేను బాధపడుతున్నాను గాని- నన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తునట్లు చూస్తున్నారే-అలాంటి శాంతిమూర్తి ఉత్తముడూ-నన్ను అనవసరంగా వీధిపాలు చేస్తారా? చెయ్యరు నాయనా? చెయ్యరు"

కాస్సేపు ఆమెలో విశ్వాసం పాతుకుపోయింది. కొద్ది క్షణాల్లో మళ్ళీ ఆరాటం పెనవేసుక వచ్చింది. "ఏమో! యీ విషయాల్లో మొగవాళ్ళకి సహనం వుండదంటారు.

సహనంవుంటే యీయనయిలా నిద్దరపోకుండా బాధపడ్తారా శ్రీరామచంద్రుడు మానవోత్తముడు-మహారాజు! నలుగురు తుంటరులు వేసిన అపవాదుకు తలొగ్గి అగ్నిలో ప్రవేశించి తన పాతివ్రత్యాన్ని నిరూపించిన మాతల్లి నిండు చూలాలు సీతమ్మనే అడవిలో విడచి పెట్టించాడు గదా? అలాంటిది నా దేముడు నన్ను యీ యింటిలో తెల్లవారే సరికి ఉండనిస్తాడా ఆయన పాదాల దగ్గర చచ్చిపోతాను గానీ లోకం వేలెత్తి చూపించినట్లుగా వీధిపాలు కాను...ఆయన దగ్గర లేకపోతే నేనోక్షణం బ్రతకలేను—? ఏం దారి తండ్రీ!"

ఆమె నిశ్శబ్దంగా వలవల యేడ్చి తలగడ తడిపింది. "తెల్లవారి లేచాక ఆయన అడుగుతారు—యేమందని చెప్తాను? నేను చెప్పింది నిజమే కానీ ఆయన నమ్మరు—కోపంతో పొమ్మంటారు.. నే నేమన్నా వినరు—ఆయన పాదాలు పట్టుకుంటాను—నన్ను కోపంతో త్రోసివేస్తారు—యీడ్చేస్తే అనాడు మా స్త్రీ జాతి ఆదర్శదేవత—సీతమ్మతల్లి ప్రార్థించినట్లుగా-మిమ్మల్ని తప్పించి యింకెవర్నీ నేను తలంచలేదు—మాటల్లోనూ, చేతల్లోనూ, ఆలోచనల్లోనూ మిమ్మల్నే కొలిచాను—మిమ్మల్ని తప్పించి యింకెవర్నీ నాకు తెలీదు ఇదే నిజమైతే—నా తల్లీ భూమాతా నీలో నన్ను కలుపుకో—బుగ్గయి నీలో హాయిగా కలిసి పోతాను..."

ఆవేశంతో ఆమె అట్టుడికి పోయింది. నరాలన్నీ తోడుకొని బలహీనం చేశాయి. వేకువ ఝామున మాగన్ను నిద్దర పట్టింది. తెలివి వచ్చేసరికి భర్త టేబిలు ముందు కూర్చుని యేదో వ్రాస్తున్నాడు. "ఎక్కడికి వెళ్ళిపోతారో—యేమో ఆయనముఖం చూడకుండా ఓ క్షణం వుండలేను...." కొంతసేపయ్యాక వ్రాసిన వుత్తరం

డ్రాయరులో పెట్టి "కాస్త అర్జంటు పనుంది. సీతా! లేలే—" అని పిలిచాడు. ఆమె లేచిందిగానీ కళ్ళల్లో నీరు తిరిగిపోతున్నాయ్. ఇంతలోనే సూర్యారావు ఆఫీసుకువెళ్ళే బట్టలు వేసుకున్నాడు. ఆంతా అలా నిల్చొనే చూస్తోంది. "ఈ పూటకు హోటలుకు పోతానులే—రాత్రే చెప్పటం మరిచి పోయాను—వేగంగా లేచేదానివి. మళ్ళీ సాయంత్రం వేగంగా వచ్చేస్తా."

తొందరగా అంటూ వెళ్ళిపోయే ముందు "అన్నట్టు సీతా! మీ బావ మోహనరావు వుత్తరం వ్రాశాడు కానీ తన యెడ్రసు వ్రాయ లేదు—ఇప్పుడు యెక్కడున్నాడో యేమిటో? ఈ వుత్తరం కవరులో పెట్టి నీకు యెడ్రసు తెలుసు కామోసు వ్రాసి పొరుగు అబ్బాయి చేత పోస్టులో వెయ్యించేద్దూ."

భర్త వెళ్ళిపోయాక డ్రాయరులో ఉత్తరం తీసి చదవటం మొదలు పెట్టింది.

"తమ్ముడూ?"

నీ వుత్తరం నిన్న సాయంత్రమే చేరింది. చదివిన నిముషంనుంచి నీకెలా జవాబు వ్రాయాలనే ఆలోచనతో రాత్రి సరిగ్గా అన్నం సహించలేదు. నిద్దరా పట్టలేదు. ఇదివరకు బహుశా నివ్వే కామోసు అప్పుడప్పుడూ సీత పేరిట ఉత్తరాలు వ్రాసేవాడివి, అవి అగ్ని ప్రీతి అయి వుండొచ్చు—సీత యెలా ఫలానా వారు వ్రాశారని, ఏ గొప్పవిషయాలున్నాయని నాతో చెప్తుంది? నీవు సీతకు వ్రాశావు-ఆమెను కల్లోల పరచాననీ, అంతతో తృప్తిపడి నాకో ఆకాశరామన్న వుత్తరం వ్రాశావు. అది బుట్టదాఖలు

అయ్యిందని కామోసు భయపడి సీత మీద లేనిపోని నిందలు వేసి నాకే వుత్తరం వ్రాశావు.

ఈ పైన వ్రాసిన పరిస్థితులు అవగాహన చేసుకుంటే నీ మనస్సూ మేథస్సూ యెంత సంస్కారం హీనమైనవో అర్థం చేసు కున్నాను. కానీ మర్యాద నాచే యీ జవాబు వ్రాయించింది.

సీత బతుకు నీకు తెలుసు. చిన్నప్పటి నుంచీ ఆమె యెన్ని కష్టాలు పడిందో? తండ్రి కూతురన్న కనీసపు బాధ్యతనే విడిచి పెట్టాడు. మీ యింట చేరింది, గతిలేని పిల్లని మీ వాళ్ళెవరూ నీకిచ్చి పెళ్ళి చెయ్యటానికి ఒప్పుకోలేదు. పోనీ నీవైనా పంతంపట్టి చేసుకున్నావుకావు మీ పొరుగున మా చెల్లాయి ఉండి, సీత మంచి చెడ్డలు. బ్రతుకూ నాతో చెప్పింది. కాబట్టి నేను ఆమె మంచిని ప్రేమించాను, ఆమె అసహాయతను కనికరించాను. నాకు ఇల్లాలై ఆమె నన్నెంత కొలుస్తుందో నీకు తెలియదు.

నీతో చాలా చనువుగా సరదాగా వుండేదని వ్రాశావు. అం దులో వున్న తప్పేమీ నాకు కనపడలేదు. సిగ్గుపడి తలుపు చాటు నుంచి చూసే ఆడవాళ్ళ కన్నా, బాహాటంగా ఆదరంగా మాట్లాడే స్త్రీలను చూస్తే నాకు హెచ్చు గౌరవం. నీ పేరుకు తగ్గట్టు నువ్వు అందగాడివి. అందులో వరసకు బావ అవుతావ్ అలాంటప్పుడు సీతో చనువుగా మాటాడటంలో తప్పేముంది? పోనీ అలా మాటా డిందని నువ్వే కనికరం చూపించావ్? నేనూ పెళ్ళి కాకముందు యెందరు అందమైన ఆడవాళ్ళ వేపు చూశాను, వాళ్ళ అందాన్ని కీర్తించాను. అంత అందమైన స్త్రీ నా భార్య అయితే బాగుండే దని తలచాను. నీవు వ్రాసినదాన్ని బట్టి నేను సీతను వదిలేస్తే, ఇదంతా తెలిస్తే నన్ను వదిలెయ్యటానికి సీతకూ్కడా హక్కువుంది.

కాని మా ఇద్దరం అంత తెలివి తక్కువవారము కాము.

ఆడవాళ్ళమీద నువ్వు విసిరే విసుర్లు నేను అర్థం చేసుకో లేకుండా వున్నాను. స్త్రీ మగవాడికి తల్లయి పాలిచ్చి కష్టపడి ఓర్పుతో పెంచి పెద్దచేస్తుంది. స్త్రీ భార్యయై మగవానికి సౌఖ్యాన్ని యిస్తుంది. ఆమె పళ్ళూడిన ముదుసలియై నిజాన్ని, జ్ఞానాన్ని మగవాడికి అందిస్తుంది. మగవాళ్ళు ఆడవాళ్ళమీద ఏద్దైన చెడును ఆపాదించేముందు స్త్రీ చేసే యీ మేలును తలుచుకోరేం? కృతఘ్నులై వారివారి ఇళ్ళను దేవాలయాలు చేసుకొనే బదులు యుద్ధరంగాలుగా మార్చుకుంటారేం? ఆడవాళ్ళను గౌరవించే కనీసపు సభ్యత మగవాళ్ళలో లేకపోతే ఆ సంఘం సజీవంగా ఎంత కాలం వర్ధిల్లుతుంది.?

తమ్ముడూ! ఒకసారి మా ఇంటికి వచ్చి నేనూ మా సీతా ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించకూడదా? నీకు తెలుసు-మా సీత నిండు మనిషిని. నివ్వు వ్రాసినట్లు ఆమెను విడిచిపెట్టడానికి నే నేమీ రాముడంత వాడ్ని కాను.

నీ అన్నయ్య

సూర్యారావు,